# అంత్యేష్టి

సర్వేశ్వర శర్మగారు తాతలనాటి నుంచీ ఉన్న అర ఎకరం పొలం కూడా అమ్మేసి, భార్యకి వచ్చిన కేన్సరుకి చికిత్స చేయించాల్సి వచ్చింది. గృహలక్ష్మి జారిపోయింది గానీ, ఆరోగ్యలక్ష్మి ఆశీస్సు లభించలేదు.

ఆవిడ ఆపరేషను వికటించింది.

50 ఏళ్ల దాంపత్య జీవనం వాడి వీడిపోయింది. వైద్యం కోసం ఆయన ఆ అర ఎకరం అమ్ముతున్నప్పుడు కొనుక్కున్న షావుకారు రామక్రిష్ణారావుకి సర్వేశ్వరశర్మ గారిమీద చాలా జాలేసింది.

నిజం చెప్పాలంటే సర్వేశ్వరశర్మగారి చెక్క తన చేలో కలుస్తుంది. రామక్రిష్ణారావు తండ్రి ఉన్నన్నాళ్లూ సర్వేశ్వర శర్మ చేత ఆ పొలం అమ్మించి... తన పొలంలో అది కలిపేసుకోవాలని చాలా ప్రయత్నం చేసేవాడు.

సర్వేశ్వర శర్మగారు ఆ ఆధరవుకూడా లేకపోతే బతకలేననో తాతల నాటి ఆస్తిని అమ్మడం ఇష్టంలేకనో మొండిగా వుండేవాడు.

భార్యకి చేసిన జబ్బు సెంటిమెంట్‌ని వదులుకోమంది.

తాతల్నాటి పొలాన్ని అమ్ముతున్నప్పుడు సర్వేశ్వర శర్మ గుండెల్లో సుళ్లు తిరిగిన దుఃఖం కళ్లలోంచి పొంగి పడదామని చేస్తున్న ప్రయత్నం రామక్రిష్ణారావు గమనించారు.

అతనికి అవసరానికి డబ్బిచ్చాడు. డబ్బు తీసుకోవడానికి అతడు పెట్టిన ఆంక్షకి అనుకూలంగా దస్తావేజు కూడా రాయించాడు. రిజిస్ట్రేషన్ కూడా చేయించాడు.

ఈ ప్రతీ ప్రొసీజర్‌కి రామకృష్ణారావు ఎన్నిసార్లు సిగ్గుపడ్డాడో, బాధ పడ్డాడో...

సర్వేశ్వరశర్మ లక్ష్యం ఒక్కటే... భార్య ఆరోగ్యం బాగుపడాలి.

అనుకున్నట్టు బాగుపడలేదు.

సర్వేశ్వర శర్మ బాధకన్నా, రామక్రిష్ణారావు బాధ ఎక్కువైంది 'తన డబ్బు మంచిది కాదేమో? ఆయనకి తన డబ్బు సాయపళ్లేదు అనుకునేవాడు.

అందుకే అవాల్టి నుండి సర్వేశ్వర శర్మ మీద చాలా జాలి చూపించేవాడు.

అది జాలి అనలేం. భక్తి అనలేం? మరి ఏం అనాలో....

✦ ✦ ✦

సర్వేశ్వర శర్మ ఇల్లాలు పోయినప్పట్నుండీ అతన్ని దుఃఖం నుంచి ఓదార్చడానికి తండ్రై, కొడుకై, అన్నై ఆదరిస్తున్నాడు రామకృష్ణారావు.

అంతకుమించి అతని ఆకలి వేళకి కావలసిన ఆధరువులు ఏర్పాటు చేస్తున్నాడు.

సర్వేశ్వర శర్మకి ఎంత మొహమాటంగా ఉన్నా కృతజ్ఞత చెప్పే ధ్యాస లేదు.

అర్ధాంగి పోగానే సగం శరీరానికి పక్షవాతం వచ్చినట్లయింది.

అన్నిటిలో నిరాసక్తత... నిర్లిప్తత ఇలాంటి పరిస్థితిలో కనిపెట్టుకు చూసే కావల్సిన వాళ్లు ఎవ్వరూ లేరు. ఉన్నా చూసినందుకు వాళ్లక్కా వల్సింది ఇతని దగ్గరేం లేదు. కనుక ఎవ్వరూ దగ్గరకు రారు.

నలభై గజాల నట్రాట గుడిసెలో ధనహీనమైన, దైన్యమైన అతన్ని పలకరించినా ప్రయోజనమేం లేదు.

ఏమీ లేకపోవడం వల్ల ఆయనకెవ్వరూ లేకపోయారు.

రామకృష్ణారావు ఒక్కడే అతని ఆస్తి- ఆపద్బంధువు, ఆప్తమిత్రుడు.

ఒక రోజు విచారంతో... దుఃఖంతో అనారోగ్యం కమ్ముకున్నప్పుడు జాలి గొలిపేలా, బేలగా...

"నేన్నిన్నేమీ అడక్కూడదు. నువ్వునాకు దయతలచి బిక్షవేస్తున్నావు"

"శర్మగారూ... దయచేసి మీరలా అనకండి. మీ బలవంతం వల్ల, మీ పొలాన్ని మీరు అమ్మారు, నేను కొనుక్కున్నానేమోగానీ... అది నాది కాదు అని నేను మనస్ఫూర్తిగా అనుకుంటున్నాను. కనీసం నేనున్న న్నాళ్లయినా ఈ సహాయం చెయ్యనివ్వండి"

"కృష్ణారావు... నువ్వలా మాట్లాడకూడదు. నీలాంటి మంచివాడు నిండు నూరేళ్లు ఉండాలి. నాలాంటి యాచకుడు ముందుగా వెళ్లాలి"

"శర్మగారూ... మీరు యాచకులు కాదు. యజమాని. నేను వేస్తున్నది బిక్షకాదు. ఇస్తున్నది శిస్తు. నాకు కౌలుకిచ్చాను అనుకోండి

మీ పంటను మీకో కొంత అందించడం నా ఔదార్యం కాదు మీ హక్కు"

"నేను నీ మంచితనాన్ని కాదనలేని స్థితిలో ఉన్న అసమర్థుణ్ణి. నువ్వు ఈ అభిమానాన్ని చూపించకపోయినా నోరెత్తలేని అప్రయోజకుణ్ని. కానీ అడగని సాయం చేస్తున్న నీకు అడిగి ఓ సాయం చేయించుకోవాలనుంది. ఇది మళ్ళీ ఋణం కాదు. ఋణం తీరిపోయే చివరి సేవ అనుకో"

"మీరు కోరిక కోరడమే అరుదు, కాదన్ను... చెప్పండి"

✦ ✦ ✦

"ఏంటో... ఆ ముసలాయనకి రోజూ దేవుడికిచ్చినట్టు స్వయం పాకాలివ్వడం... ఏం పుణ్యాం పావుకుందామనో"

"పుణ్యాం బావుకోడానికి కాదు. పాపం తోముకోవడానికి.."

"మీరేమంత పాపం చేసారట?"

"చేశాను, ఆ పాపం నీకూ మన పిల్లలకి అంట కూడదని తాపత్రయ పడుతున్నాను..."

భార్యతో రోజూ జరిగే పోరాటాన్ని చాలా సహనంగా భరించడం రామకృష్ణారావుకు అలవాటయింది.

ఇప్పుడు సర్వేశ్వర శర్మగారు చివరి కోరికంటూ ఉంటే-

✦ ✦ ✦

"చెప్పండి శర్మగారూ... మొహమాటమొద్దు... నేను మీ తమ్ముడి లాంటివాణ్ణి"

"నేను బుధవారం చనిపోతాను. మూడ్రోజుల టైం ఉంది. నా అంత్యక్రియలు నా బంధువులనెవ్వరిని పిలవకుండా నువ్వే చెయ్యాలి"

"శర్మగారూ...." నిర్ఘాంతపోతూ, గద్గదంగా ఆగాడు రామకృష్ణారావు.

సర్వేశ్వర శర్మగారు నిశ్చయమైన మౌనంతో అతని కళ్లలోకే చూస్తున్నాడు.

"నేను... బ్రాహ్మణున్ని కాదు. మీరు కోరిన కోరిక..."

"ప్రాణం లేని కట్టెకి కులాలు ఏంటయ్యా....??

అయినా .... అనాథ ప్రేత సంస్కారం పుణ్యం కలిగిస్తుంది. కాదనకు. అన్నదానం చేస్తున్నావు. అంత్యేష్టి పుణ్యం కూడా నువ్వే దక్కించుకో"

"మీరు నిండు నూరేళ్లు బ్రతకాలి అని అనుకునేవాణ్ణి నేను. మీరు బుధవారం స్వర్గ ప్రయాణానికి ముహూర్తం పెట్టేసుకున్నారు. నాకీ మాట వినడానికే మనస్కరించక పోయినా... మనస్ఫూర్తిగా మీ మాటని పాటించడానికి అంగీకరిస్తున్నాను"

✦ ✦ ✦

రామకృష్ణారావు మనస్సులాగే ఆకాశం ముసురేసింది.

అతని కళ్ళలో పొంగాల్సిన నీరు ఆ మంగళవారం నుంచీ మేఘాలు కురిపిస్తున్నాయి. బుధవారం కూడా తెరిపిన పడలేదు. గొడుగేసుకుని బియ్యం, పప్పూ గట్రా (స్వయంపాకం) పట్టుకుని శర్మగారింటికి బయల్దేరాడు కృష్ణారావు.

ఆయన జ్యోతిషంమ్మీద నమ్మకమైతే ఉందిగానీ, ఆయన మరణిస్తానని చెప్పిన మాటని జీర్ణించుకోవడం కష్టంగా వుంది.

ఆయనకేం అవకూడదు అనుకునే ఇలా స్వయంపాకంతో బయల్దేరాడు.

ఆయన జోస్యం నిజమైంది.

తనకోసమేనా అన్నట్టు- తలుపు బార్లా తెరిచి ఆయన ప్రాణం గాలిలో కలిసిపోయింది.

రామకృష్ణారావు తడిసిన బట్టల్లో, అతని కన్నీళ్లు కలిసిపోయాయి.

అంత్యక్రియలు చేస్తావుగా, సర్వేశ్వర శర్మగారు ఆశగా చూస్తున్నట్టు కళ్లు తెరుచుకునే గతించారు.

కనురెప్పలు చేతుల్తో మూసి, ఈ వర్షంలో ఏం చెయ్యడమా? అన్న ఆలోచనల్లోంచి ఆయనకి ఒక ఉపాయం స్ఫురించింది.

✦ ✦ ✦

సర్వేశ్వర శర్మగారి ఇల్లు తగలబడిపోయింది.

నిట్రాట నుంచి మంటలు పైకెగిసి పొడిగా వున్న కప్పు మేరా అంటుకుని కుప్పకూలి ఆయన దహనమైపోయాడు.

బయట నిలబడిన రామకృష్ణారావు శర్మగారికి కపాల మోక్షం జరిగే దాకా ఆగి వర్షస్నానం చేసి ఇంటికెళ్లాడు.

✦ ✦ ✦

ఆయన అర ఎకరం పొలానికి తోడుగా దాని ప్రక్కనున్న తన రెండెకరాల్ని శాశ్వత విరాళంగా పట్టారాసి - ఆ స్థలంలో సర్వేశ్వర శర్మ జ్ఞాపకార్థం ఒక వృద్ధాశ్రమం నిర్మించాడు రామకృష్ణారావు.

